తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : రత్నం నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
10 నవంబర్ 2025
సంపుటి 83
సంచిక 3
పేజీలు 7
వెల రూ. 5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## కోటి దీపోత్సవానికి రాష్ట్ర పండుగ హోదా

### - రేవంత్‌రెడ్డి

- వచ్చే ఏడాది నుంచి అధికారికంగా ఉత్సవాల నిర్వహణ
- జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని వెల్లడి
- ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొన్న సీఎం
- పుట్టినరోజు వేడుకలను భక్తుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్న రేవంత్



తరంగాలు /డెస్క్ : హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది నుంచి 'రాష్ట్ర పండుగ'గా, అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన తన అర్ధాంగితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కోటి దీపోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఇదే వేదికపై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే జాతీయ గుర్తింపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రకటనకు ప్రాధాన్యం సంతరించుకుంది. తన పుట్టిన రోజున, నాలుగు కోట్ల మంది ప్రజలకు వేదికగా నిలుస్తున్న ఇంతటి పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్జీపురం మఠం పీఠాధిపతి శ్రీవామనాశ్రమ స్వామి.. ముఖ్యమంత్రి దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో ఎన్టీవీ అధినేత నరేంద్ర చౌదరి దంపతులు, పలువురు స్వామీజీలు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..

### - ముగిసిన ప్రచారం..

- నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక
- పోలింగ్ బరిలో 58 మంది అభ్యర్థులు
- ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ
- నవంబరు 14న ఓట్ల లెక్కింపు




తరంగాలు / డెస్క్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారానికి తెరపడింది. గతకొన్ని రోజులుగా హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. నవంబరు 11, మంగళవారం పోలింగ్ జరగనుండగా, ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉప ఎన్నికలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా దీపక్ రెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరితో పాటు మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పార్టీల నేతలంతా చివరి రోజు వరకు విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం 407 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా 139 సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. నవంబరు 11న పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాన్ని వెల్లడిస్తారు. దీంతో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది.

## నా కుమారుడి మరణం ఓ మిస్టరీ

### - పోలీసులకు ఫిర్యాదు చేసిన మాగంటి గోపీనాథ్ తల్లి

- కొడుకు మృతిపై అనుమానాలున్నాయన్న మహానంద కుమారి
- కొడుకు మరణంపై విచారణ కోరుతూ పోలీసులకు ఫిర్యాదు
- గోపీనాథ్ ఆసుపత్రిలో ఉన్నప్పుడు తనను చూడనివ్వలేదని ఆవేదన
- సునీత పైనా, కేటీఆర్‌పైనా తీవ్ర ఆరోపణలు
- మొదటి భార్యకు విడాకులు ఇవ్వలేదని, వారసత్వ పత్రంలో పేరు లేదని వెల్లడి
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు ముందు రాజుకున్న కుటుంబ వివాదం



తరంగాలు / డెస్క్: దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణం ఒక మిస్టరీగా మిగిలిపోయిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన తల్లి మహానంద కుమారి డిమాండ్ చేశారు. తన కొడుకు మరణానికి దారితీసిన పరిస్థితులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె పోలీసులకు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరగడానికి కేవలం రెండు రోజుల ముందు గోపీనాథ్ తల్లి, ఆయన మొదటి భార్య మాలిని, కుమారుడు తారక్‌తో కలిసి మీడియా ..

2

## రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు రోజుకి రూ.1 కోటి నష్టం

- హైదరాబాద్‌లో సైబర్ మోసాల మోత
- 'జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్' అవగాహన కార్యక్రమం ప్రారంభం
- 'సైబర్ సింబా' లోగో, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించిన పోలీసులు
- మహిళలు, వృద్ధులే సైబర్ నేరగాళ్ల ప్రధాన లక్ష్యం అని డీజీపీ వెల్లడి
- మోసపోతే వెంటనే 1930కి కాల్ చేయాలని ప్రజలకు సూచన
- స్వీయ అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట సాధ్యమని స్పష్టం

తరంగాలు / డెస్క్ : హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రజల ఆశ, భయాన్ని ఆసరాగా చేసుకుని జరుపుతున్న మోసాల కారణంగా నగరవాసులు సగటున రోజుకు రూ.1 కోటి నష్టపోతున్నారని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఈ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పోలీసు శాఖ 'జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆదివారం నాడు డీజీపీ బి. శివధర్ రెడ్డితో కలిసి కమిషనర్ సజ్జనార్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 'సైబర్ సింబా' లోగో, క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించి, వాలంటీర్లకు బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ.. గత దశాబ్ద కాలంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ఇది ఇప్పుడు ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వీయ అవగాహనతోనే ఈ నేరాలను అరికట్టగలమని, అందుకే తెలంగాణ వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. "నేరగాళ్లు వ్యక్తుల సంపద, వయసు, చిరునామా వంటి వివరాలు సులభంగా సేకరించి ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు...

2

## హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి

### - పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు



తరంగాలు / డెస్క్ : హైదరాబాద్‌లో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. గత మూడు రోజులుగా రాత్రి సమయాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో భాగ్యనగరవాసులు చలికి వణికిపోతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున చలిగాలుల ప్రభావం అధికంగా ఉంటోంది.

వాతావరణ శాఖ అధికారుల వివరాల ప్రకారం శనివారం నగరంలో 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే తక్కువని వారు వెల్లడించారు. రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట కూడా మంచు ప్రభావం కనిపిస్తోంది.

నగర కేంద్రంతో పోలిస్తే శివారు ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. పటాన్‌చెరులో అత్యల్పంగా 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, దుండిగల్‌లో 15 డిగ్రీలు, హయత్‌నగర్‌లో 17, హకీంపేటలో 17.1, రాజేంద్రనగర్‌లో 18 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## సమావేశానికి ఆలస్యంగా రాక..

### - 10 పుష్ అప్‌లు తీసిన రాహుల్ గాంధీ

- మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ శిక్షణ శిబిరానికి ఆలస్యంగా వచ్చిన రాహుల్ గాంధీ
- నిబంధనల ప్రకారం శిక్షగా 10 పుష్-అప్‌లు తీయాలన్న ఇన్‌ఛార్జ్
- వెంటనే అంగీకరించి పుష్-అప్‌లు తీసిన రాహుల్
- ఆయన్ను అనుసరించిన ఇతర జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు


2



## ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు - మోహన్ భగవత్

- ఏ రాజకీయ పార్టీకి తాము మద్దతు ఇవ్వబోమన్న మోహన్ భగవత్
- రామ మందిరానికి కాంగ్రెస్ మద్దతిచ్చినా అండగా నిలిచేవాళ్లమని వెల్లడి
- జకాషాయం మాకు గురువు లాంటిది, అందుకే ఆ జెండాను ఎగరేస్తాం అని వివరణ
- విమర్శలను పట్టించుకోం.. అవే మాకు మరింత ప్రచారం కల్పిస్తాయి అని వ్యాఖ్యలు

2



# నా కుమారుడి మరణం ఓ మిస్టరీ

## - పోలీసులకు ఫిర్యాదు చేసిన మాగంటి గోపీనాథ్ తల్లి

మొదటిపేజీ తరువాయి..

సమావేశం నిర్వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఆదివారం మీడియాతో మాట్లాడిన 92 ఏళ్ల మహానంద కుమారి, తన కొడుకు మరణవార్తను సైతం తనకు సరిగ్గా తెలియజేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. "నా కొడుకు జూన్ 6న చనిపోయాడో, జూన్ 8న చనిపోయాడో కూడా కన్నతల్లినైన నాకు తెలియదు," అని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తన కుమారుడికి వైద్యం అందించడంలో నిర్లక్ష్యం జరిగిందని ఆరోపిస్తూ శనివారం ఆమె రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఎంతో పేరు సంపాదించుకున్న తన కొడుకును ఆసుపత్రిలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా చూడనివ్వలేదని ఆమె ఆరోపించారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు తనను చూసేందుకు అనుమతించవద్దని దిశిర అనే వ్యక్తి సంతకంతో ఆసుపత్రి సిబ్బందికి రాతపూర్వక ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసుపత్రి నుంచి బయటకు వచ్చిన తర్వాతే గోపీనాథ్ మరణవార్తను అధికారికంగా ప్రకటించారని ఆమె గుర్తుచేశారు.

గోపీనాథ్ తన మొదటి భార్య మాలినికి చట్టప్రకారం విడాకులు ఇవ్వలేదని, అయినప్పటికీ వారసత్వ ధృవపత్రంలో ఆమె పేరు, వారి కుమారుడి పేరు చేర్చలేదని మహానంద కుమారి వెల్లడించారు. తనకు న్యాయం చేయాలని కేటీఆర్‌ను చాలాసార్లు వేడుకున్నా ఆయన పట్టించుకోలేదని, కనీసం గోపీనాథ్ రెండో భార్య సునీతకు టికెట్ ఇచ్చే విషయం కూడా తమకు చెప్పలేదని ఆమె వాపోయారు. "ఇది డబ్బుల కోసం చేస్తున్న పోరాటం కాదు. మా అస్తిత్వం కోసం, మా గుర్తింపు కోసం మీడియా ముందుకు వచ్చాం," అని ఆమె స్పష్టం చేశారు.

గోపీనాథ్ కుమారుడు తారక్ మాట్లాడుతూ, తమకు చట్టపరమైన గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన చెందారు. తన తండ్రి తన తల్లికి చట్టబద్ధంగా విడాకులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. తాను విదేశాల్లో చదువుకుంటున్నప్పుడు తన గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి వస్తానని తండ్రి చెప్పారని, కానీ ఇంతలోనే ఆయన ఆకస్మికంగా మరణించారని తెలిపారు. తాను ఇండియాకు రావాల్సిన అవసరం లేదని, కేటీఆర్ అంకుల్ ఏదైనా కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పారని, తన రెజ్యూమ్ పంపితే చాలని సునీత ఫోన్‌లో చెప్పినట్లు తారక్ సంచలన ఆరోపణలు చేశారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో సునీత నామినేషన్ దాఖలు చేసినప్పుడు కూడా మాలిని, తారక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తన తండ్రి మొదటి భార్యకు విడాకులు ఇవ్వనందున సునీత కేవలం సహజీవనం మాత్రమే చేశారని వారు వాదించారు. అయితే, రిటర్నింగ్ అధికారి వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా సునీత నామినేషన్‌ను ఆమోదించారు. ఉపఎన్నికల వేళ ఈ కుటుంబ వివాదం బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారింది.

# సమావేశానికి ఆలస్యంగా రాక..

## - 10 పుష్ అప్‌లు తీసిన రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి..

తరంగాలు / డెస్క్ :

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఓ సరదా శిక్ష పడింది. మధ్యప్రదేశ్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమానికి ఆలస్యంగా రావడంతో, ఆయన 10 పుష్-అప్‌లు తీయాల్సి వచ్చింది. ఆయన ఎలాంటి సంకోచం లేకుండా ఈ శిక్షను స్వీకరించడంతో, ఆలస్యంగా వచ్చిన ఇతర జిల్లా అధ్యక్షులు కూడా ఆయన్ను అనుసరించారు. దీంతో ఒక అధికారిక సమావేశం కాస్తా, ఆహ్లాదకరమైన కార్యక్రమంగా మారిపోయింది.



కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, మధ్యప్రదేశ్‌లోని పచ్‌మఢీలో 'సంఘటన్ సృజన్ అభియాన్' పేరుతో పార్టీ బలోపేతం కోసం నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో ఈ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. బీహార్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నప్పటికీ, రాహుల్ ఈ సమావేశానికి హాజరయ్యారు. అయితే ఒక సెషన్‌కు ఆయన ఆలస్యంగా వచ్చారు.

దీంతో శిక్షణా కార్యక్రమ ఇన్‌ఛార్జ్ సచిన్ రావు, ఆలస్యంగా వచ్చిన వారికి శిక్ష తప్పదని అన్నారు. అప్పుడు రాహుల్, "నేనేం చేయాలి?" అని అడగ్గా, "కనీసం 10 పుష్-అప్‌లు తీయాలి" అని సచిన్ రావు సరదాగా బదులిచ్చారు. తెలుపు టీ-షర్ట్, ట్రౌజర్‌లో ఉన్న రాహుల్ గాంధీ వెంటనే ఆ సూచనను పాటించారు. దీంతో అక్కడున్న జిల్లా అధ్యక్షులు కూడా ఆయన్ను అనుసరించారు. వారు కూడా పుష్-అప్‌లు తీశారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందిస్తూ, "జిల్లా అధ్యక్షుల నుంచి చాలా మంచి స్పందన వచ్చింది" అని తెలిపారు.

### బీజేపీ, ఈసీపై విమర్శలు

ఇదే సమావేశంలో రాహుల్ గాంధీ, అధికార బీజేపీపైనా, ఎన్నికల సంఘంపైనా విమర్శలు కొనసాగించారు. ఎన్నికల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఎన్నికల్లోనూ ఇలాంటి మోసాలే జరిగాయని అన్నారు. "కొన్ని రోజుల క్రితం నేను హర్యానా వ్యవహారాన్ని బయటపెట్టాను. అక్కడ ప్రతి 8 ఓట్లకు ఒకటి చొప్పున 25 లక్షల ఓట్లు దొంగిలించారు. ఇదే వారి వ్యవస్థ. మా వద్ద ఆధారాలున్నాయి, ఒక్కొక్కటిగా బయటపెడతాం'' అని రాహుల్ పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను బీజేపీ, ఎన్నికల సంఘం ఖండించాయి.

# 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్

## - రూ.95 కోట్లు మోసం చేసిన 81 మంది అరెస్ట్

తరంగాలు /డెస్క్

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి, రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన 81 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. వీరిపై దేశవ్యాప్తంగా 754 కేసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణ పోలీసుల కథనం ప్రకారం, సైబర్ నేరగాళ్ల కదలికలపై నిఘా పెట్టిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో... ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 81 మందిని అదుపులోకి తీసుకుంది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు. నిందితుల నుంచి 84 సెల్‌ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న కోట్లాది రూపాయల నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు




ఫ్రీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ అరెస్టులతో దేశంలోని అనేక సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడినట్లయిందని అధికారులు తెలిపారు.

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు...

## రోజుకి రూ.1 కోటి నష్టం

మొదటిపేజీ తరువాయి..

ముఖ్యంగా ఒంటరిగా ఉండే మహిళలు, వృద్ధులు, గృహిణులను లక్ష్యంగా చేసుకుని, వారిని భయపెట్టి డబ్బులు కాజేస్తున్నారు" అని ఆయన వివరించారు. ప్రతి ఇంట్లో సైబర్ మోసాలపై అవగాహన ఉన్న ఒక్క 'సైబర్ సింబా' ఉన్నా, సమాజం మొత్తం సురక్షితంగా ఉంటుందని డీజీపీ అన్నారు. ఈ ఉద్యమంలో యువత, విశ్రాంత ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేరాలను నిరోధించేందుకు 'సైబర్ పెట్రోలింగ్' కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ, అనుమానాస్పద కాల్స్, లింకులు, యాప్‌లను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, బలమైన పాస్‌వర్డ్‌లు వినియోగించాలని సలహా ఇచ్చారు. సైబర్ మోసాల బారిన పడిన బాధితులు తక్షణమే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. అనంతరం, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో సజ్జనార్ 'సైబర్ ప్రతిజ్ఞ' చేయించారు.

# ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ పార్టీలకు మద్దతు ఇవ్వదు - మోహన్ భగవత్



తరంగాలు / డెస్క్ :

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఏ ఒక్క వ్యక్తికి గానీ, రాజకీయ పార్టీకి గానీ మద్దతు ఇవ్వదని, కేవలం దేశ ప్రయోజనాలకు ఉపయోగపడే విధానాలకు మాత్రమే కట్టుబడి ఉంటుందని ఆ సంస్థ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా బెంగళూరులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఓ ప్రశ్నకు భగవత్ బదులిస్తూ, "మేము ఏ రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వం. ఎన్నికల రాజకీయాల్లో పాల్గొనబోము. సమాజాన్ని ఏకం చేసే పనిలో సంఘ్ నిమగ్నమై ఉంది. కానీ రాజకీయాలు స్వభావరీత్యా విభజనకారిగా ఉంటాయి" అని వివరించారు. దేశానికి మేలు చేసే విధానాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని, తమ ప్రభావాన్ని ఉపయోగించి సరైన విధానాలకు అండగా నిలుస్తామని తెలిపారు.

"ఉదాహరణకు, అయోధ్యలో రామ మందిరం కావాలని మేము కోరుకున్నాం. ఆ లక్ష్యం కోసం నిలబడిన వారికి మా వలంటీర్లు మద్దతు ఇచ్చారు. ఆ సమయంలో బీజేపీ ఆ ఉద్యమంలో ఉంది కాబట్టి వారికి మద్దతిచ్చాం. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రామమందిర ఉద్యమానికి మద్దతు ఇచ్చి ఉంటే, మా కార్యకర్తలు ఆ పార్టీతోనే నిలబడేవారు" అని ఆయన తేల్చిచెప్పారు.

"మాకు ఏ పార్టీ సొంతం కాదు, అలాగని ఏ పార్టీ పరాయిదీ కాదు. ఎందుకంటే అవన్నీ భారతీయ పార్టీలే. మేము 'రాష్ట్ర నీతి'కి మద్దతిస్తాం, 'రాజనీతి'కి కాదు. ఈ దేశం ఏ దిశలో పయనించాలనే దానిపై మాకు ఒక దార్శనికత ఉంది. ఆ దిశగా ఎవరు పనిచేసినా వారికి మా మద్దతు ఉంటుంది" అని భగవత్ పేర్కొన్నారు.

### జెండా వివాదంపై స్పష్టత

జాతీయ జెండాకు బదులుగా ఆర్ఎస్ఎస్ ఎందుకు కాషాయ జెండా (భగవా ధ్వజ్)ను ఉపయోగిస్తుందన్న ప్రశ్నకు ఆయన వివరణ ఇచ్చారు. "సంఘ్ 1925లో ప్రారంభమైంది. మాకు ఒక గురువు అవసరం. కానీ వ్యక్తిని గురువుగా స్వీకరిస్తే, వారికి పరిమిత ఆయుష్షు ఉంటుంది. అందుకే శాశ్వతంగా ఉండే మన సంస్కృతికి, హిందూత్వానికి ప్రతీకగా కాషాయ జెండాను గురువుగా స్వీకరించాం" అని తెలిపారు.

జాతీయ జెండాను 1937లో ఖరారు చేశారని, దాని రూపకల్పన జరిగినప్పటి నుంచి తాము త్రివర్ణ పతాకాన్ని గౌరవిస్తూనే ఉన్నామని అన్నారు. "ప్రైవేట్ సంస్థలు జాతీయ జెండాను ఎగురవేయవచ్చని కోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత, జనవరి 26, ఆగస్టు 15న అన్ని శాఖలలో జెండా వందనం చేస్తున్నాం. కమ్యూనిస్ట్ పార్టీకి ఎర్ర జెండా, కాంగ్రెస్‌కు వారి జెండా ఉన్నట్లే, మాకు కాషాయ జెండా ఉంది. ఇందులో వివాదం ఏమీ లేదు" అని స్పష్టం చేశారు.

మీడియా విమర్శలపై స్పందిస్తూ, "ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొందరి పని సంఘ్ గురించి సందేహాలు రేకెత్తించడమే. వారి విమర్శల వల్లే మాకు మరింత ఆదరణ పెరుగుతోంది. నిజం తెలిసినా కొందరు విమర్శిస్తూనే ఉంటారు. మేము వాటిని పట్టించుకోకుండా దేశం కోసం మా పని మేము చేసుకుంటూ పోతాం" అని మోహన్ భగవత్ అన్నారు.

# నలుగురు పేకాటరాయుల అరెస్ట్



తరంగాలు / సంగారెడ్డి, నవంబర్ 9 : పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం జహీరాబాద్ పోలీస్ లు పట్టుకున్నారు. జహీరాబాద్ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామ శివరులో డైమండ్ హెూటల్ వెనక గల మ్యాంగో ఫామ్ హౌస్ దగ్గర ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న విషయం తెలుసుకున్న పోలీస్ లు ఆకస్మిత దాడులు చేయగా 4 మంది జూదరులు పట్టుబడ్డారు. వారి వద్ద నుండి రూ.6,890/- నగదు, 04 మొబైల్స్,52 పేకాట ముక్కలు ను సీజ్ చేసి సుమోటో కేసు నమోదు చేయటం జరిగిందని తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు

## - ఎంసిపిఐ మండల కార్యదర్శి మ్రిపెల్లి మొగిలి

కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్ 09, తరంగాలు : అక్టోబర్ 31 నాడు మార్కెట్ యార్డ్ ను సందర్శిం చి నా సందర్భం గా స్టేషన్, కేసముద్రం విలేజ్ కేసముద్రం అమినాపురం, సబ్‌స్టేషన్, ధన్నసరి,పూర్వగ్రామపంచాయతీల్లో నెలల తరబడి వీధిదీపాలు వెలగడం లేదని చాలాచోట్ల లైట్లు కాలిపోయి చీకట్లోనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని గతంలో గ్రామపంచాయతీ కాలంలో లైట్లు కాలిపోతే వెంటనే మార్చేవారని, కానీ మునిసిపాలిటీ అయిన తర్వాత లైట్లు మార్చడంలేదని దీనిపై అడిగితే మునిసిపల్ అధికారులు 'డబ్బులు లేవు', 'లైట్లు లేవు' అని తప్పించుకుంటున్నారు," అని ఇక రోడ్ల పరిస్థితి కూడా దయనీయంగా ఉందని పలు వీధుల్లో గుంతలు ఏర్పడి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గేట్వాలు లీకై రోడ్లపై నీరు ప్రవహించడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని. మునిసిపాలిటీ ప్రజల నుండి ఇంటిపన్నులు, నల్లాపన్నులు, ఇతర పన్నులు సక్రమంగా వసూలు చేస్తోందని, కానీ ప్రజల ప్రాథమిక అవసరాలను మాత్రం విస్మరిస్తోందని కాబట్టి వెంటనే వీధిదీపాలను సరిచేయాలి, రోడ్లపై గుంతలకు మరమ్మతులు చేయాలి, గేట్వాలు లీకేజ్ కాకుండా చర్యలు తీసుకోవాలని వివిధ



సమస్యపై వినతి పత్రం అంద చేసిన ఎంసిపిఐ నాయకుల వినతిని స్వీకరించి సత్వారా పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే మురళి నాయక్ కి కృతజ్ఞతలుతెలియజేస్తున్నాటు పార్టీ మండల కార్యదర్శి మ్రిపెల్లి మొగిలి జాటోత్ బిచ్చ నాయక్ ఉల్లి ప్రతాప్ లింబా ప్రియాంక మొగిలి నారాయణ తెలియజేసారు.

# శ్రీ వినాయక యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

- ❖ అధ్యక్షులుగా నారబోయిన రమేష్
- ❖ ప్రధాన కార్యదర్శిగా మేకల సురేష్



కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్. 09, తరంగాలు కేసముద్రం మున్సిపాలిటీ కేసముద్రం విలేజ్ లో ఆదివారం గత 17 సంవత్సరాల క్రితం 30 మంది సభ్యులు కలిసి ఐక్యతతో నిర్ణయం తీసుకొని 2007 అక్టోబర్ 1న ఏర్పాటు చేసుకున్న శ్రీ వినాయక యూత్ అసోసియేషన్ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నూతన కమిటీని ఎన్నుకుంటున్న సందర్భంగా ఈరోజు శ్రీ వినాయక యూత్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ నూతన కమిటీ అధ్యక్షునిగా నారబోయిన రమేష్, ప్రధాన కార్యదర్శిగా మేకల సురేష్,గౌరవ అధ్యక్షులుగా చింతనూరి సతీష్, ఉపాధ్యక్షులుగా డొనికల రాజు, కోశాధికారిగా వెన్ను బిక్షపతి,గౌరవ సలహాదారులుగా కీర్తి రజిని,ఎస్.కె రహమాన్, కార్యవర్గ సభ్యులుగా ఎండి యాకూబ్ పాషా, ఎండి అయూబ్ లను సంఘ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు రమేష్ ప్రధాన కార్యదర్శి మేకల సురేష్లు మాట్లాడుతూ... గత 17 సంవత్సరాలుగా దినదినాభివృద్ధి చెందుతున్న ఈ వినాయక సంఘం యూత్ అసోసియేషన్ ముందుకు వెళ్లడానికి సంఘం యొక్క అభివృద్ధికి ఇంకా ఎన్నో కార్యక్రమాలను చేపట్టి ఈ సంఘాన్ని అందరికీ ఆదర్శవంతంగా నిలిచే విధంగా ఉన్నత స్థానంలో ఉంచడానికి కృషి చేస్తూ మా యొక్క సహాయ సహకారాలు ఎల్లవేళలా వినాయక యూత్ అసోసియేషన్ కి ఉ ంటుందని మా ఎన్నికలకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్క సంఘ సభ్యునికి నూతన కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అల్వాల కుమార్,జవ్వాజి బిక్షపతి,మేకల వెంకన్న, సముద్రాల మల్లయ్య, సుదగాని సతీష్,ఎండి మహమ్మద్,బోడ వీరన్న, ఎండి గుంశావళి, అమీర్,సాదిక్, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చల్ల



సంగెం, నవంబర్ 9, తరంగాలు : మండలంలోని నార్లవాయి గ్రామానికి చెందిన ఆకుల అరుణ ఇటీవలే మృతిచెందగా ఆదివారం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి .ఈ సందర్భంగా అరుణ మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పసునూరి సారంగ పాణి, మాజీ జెడ్పిటిసి గూడ సుదర్శన్ రెడ్డి, వేల్పుల కుమారస్వామి, మసూద్ అలీ, మండల బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే ప్రచారం

- ❖ పదేళ్ల బిఆర్ఎస్ పాలనను ఎండగడుతూ రెండు ఏళ్ల కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమంపై ఇంటిట ప్రచారం





మహబూబాబాద్ ప్రతినిధి, నవంబర్. 09, తరంగాలు : మోతి నగర్,కార్మిక నగర్,రహమత్ నగర్,బోరబండ,యూసఫ్ గూడ జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డా భూక్య మురళి నాయక్ విస్తృతంగా వినూత్నంగా ప్రచారం చేపడుతూ అందరి మన్నలను పొందుతున్నాడు. తెలంగాణ వాదానికి గుండెకాయ లాంటి జానపద గేయాలు డప్పు కళాకారుల నృత్యాల ద్వారా 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిన అరాచకాలను ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారాన్ని నిర్వహించారు. కేవలం రెండు సంవత్సరాల రేవంత్ పాలనలో అందిన ఎన్నో అభివృద్ధి సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. ప్రతి పేదవాడు కడుపునిండా అన్నం తినాలన్న సంకల్పంతో అమలు చేస్తున్న సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఉ చిత కరెంట్, మహిళలకు బస్సుల్లో ఉ చిత ప్రయాణం,ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కోసం ఉద్యోగల భర్తీ ప్రభుత్వ పాఠశాలలకు గురుకులాల అభివృద్ధి రైతులకు రైతు భరోసా ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాల పై ఇంటింట తిరుగుతూ ఓటర్లకు వివరించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో గ్రామపంచాయతీ నుండి రాష్ట్ర స్థాయి వరకు ఎన్నో అరాచకాలు ,దోపిడీలు జరిగాయని ప్రజల అవసరాలను మరిచి అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ పేరుకు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది అని అన్నారు. గత రెండు పర్యాయాలు బిఆర్ఎస్ కి వేటు వేశారని ఎలాంటి అభివృద్ధి జరిగిందో చూశారని ఒక్కసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మీ స్థానికుడు నవీన్ యాదవ్ చేతి గుర్తు పై ఓటు వేసి గెలిపించి జూబ్లీహిల్స్ అభివృద్ధి అంటే ఏమిటో చూడాలని ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు.

# అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రజా యుద్ధపందా మార్గంలో కొనసాగుదాం

## - సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మండల వెంకన్న పిలుపు

కేసముద్రం, మహబూబాబాద్, ప్రతినిధి, నవంబర్ 09, తరంగాలు : సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులు భాగంగా ఈనెల నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంతాప సభల పిలుపులో భాగంగా శనివారం రాత్రి ఏడు గంటలకు కేసముద్రం మండలం కల్వల గ్రామంలో అమరులైన కామ్రేడ్ ఎదునూరి వెంకన్న సంతాప సభ మండల కార్యదర్శి కామ్రేడ్ కొట్టం అంజయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించి పార్టీ గ్రామ కార్యదర్శి కామ్రేడ్ సైదులు పార్టీ స్తూపం పై జెండా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం జరిగిన సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మండల వెంకన్న మాట్లాడుతూ భారత విప్లవోద్యమ చరిత్రలో భూమికోసం భుక్తి కోసం అసమానతలు లేని దోపిడీ పీడనలు లేని సమ సమాజ స్థాపన కోసం ఈ దేశ విముక్తి కోసం సాయుధ పోరాటమే ఏకైక మార్గమని నాటి తెలంగాణ సాయుధ పోరాటం శ్రీకాకుళం నక్సల్ బరిఅమరులు కామ్రేడ్ సంధ్ర పుల్లారెడ్డి స్థాపించిన గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో నాటినుండి నేటి వరకు కోటన్న బాటన్న దొరన్న రవన్న ఎల్లన్న లింగన్న కాచన పెల్లి అమరవీరులు దాదాపు 15 వేల మంది వీరులు వీర వనితలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా ప్రజల కోసం తృణప్రాయంగా అర్పించినారని అనేక నిర్బంధాలను దాడులను ఎన్కౌంటర్లను ఎదుర్కొని వారి నాయకత్వంలో అనేక విజయాలు సాధిస్తూ దాదాపు పది లక్షల ఎకరాల పోడు భూములను నరికించి భూమిలేని ఆదివాసి గిరిజన గిరిజన ఇతర పేద ప్రజలకు పంచిపెట్టి వాటి పట్టా హక్కు సాధించుకోవడం జరిగిందని అలాగే విద్యార్థి యువజన మహిళ కార్మిక రైతాంగ హక్కులకై అనేక పోరాటాలు కొనసాగిస్తుందని ఎన్నో త్యాగాలతో సాధించుకున్న వన్ ఆఫ్ సెవెంటీ వీసా చట్ట 2006 అటవీ హక్కుల చట్టాలను నిర్వీర్యం చేస్తూ 2022 నూతన అటవీ హక్కుల చట్టం నియమావళి పేరుతో మతోన్మాద బిజెపి మోడీ ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకువచ్చి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసిందని ప్రభుత్వ రంగ పరిశ్రమలైన రైల్వేలు విమానయానం ఓడరేవులు సింగరేణి విశాఖ స్టీల్ ప్లాంట్ ఎల్ఐసి బ్యాంకులులాంటి సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు ఆధార అంబానీలకు కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టి అమ్మి వేసిందని రైతాంగాన్ని నిర్వీర్యం చేసి మూడు నల్ల తీసుకువచ్చి44 కోడులుగా ఉన్న కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా మార్చి రైతాంగాన్ని కార్మికులను బజారున పడవేసిందని క గార్ పేరుతో అమాయక గిరిజన ఆదివాసి గ్రామాలపై గుడాలపై దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు చిత్రహింసలకు గురిచేసి అక్కడి భూములను అందులో ఉన్న విలువైన 180 రకాల ఖనిజ సంపదను ప్రైవేటు వ్యక్తులకు తాకట్టు పెట్టిఅమ్మి వేసిందని 2026 మార్చి 30 వరకు దేశంలో నక్సలిజం లేకుండా చేస్తానని మోడీ అమిత్ షా కంకణం కట్టుకొని క్రూర రాక్షస నిర్బంధాన్ని కొనసాగిస్తూ ఎన్కౌంటర్ల పేరుతో దాదాపు 15 వందల మంది వీరులను అమాయక ఆదివాసులను ఎన్కౌంటర్ల పేరుతో హత్యకాండ చేసిందని మానవ హక్కులను విస్మరించి తీవ్ర రాక్షస నిర్బంధాన్ని కొనసాగిస్తుందని మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని దీనికి వ్యతిరేకంగా ప్రజలు రైతులు కూలీలు



కార్మికులు ప్రజాస్వామికవాదులు పోరాటాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా నాయకులు కామ్రేడ్ నందగిరి వెంకటేశ్వర్లు, హలవత్ లింగన్న,శివారపు శ్రీధర్, చారి హరీష్, నేతకాని రాకేష్,పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మండల నాయకులు బట్టు నాగేశ్వరరావు బొమ్మగాని వెంకన్న, దాసరి సరూప,లేదన్న సా-రయ్య, దాసరి రాములు, బెల్లి మురళి, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు బట్ట మేకల రాజు, మిట్టగడుపుల వెంకన్న, హమాలి యూనియన్ మండల అధ్యక్షులు, బండి రాజు, మదర్,బట్టు వెంకన్న అరుణోదయ బృందం నాయకులు కుక్కముడి యాకన్న తదితరులు పాల్గొన్నారు.

# తుర్కపల్లిలో అంగరంగ వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

## - ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి నివాసంలో ఆధ్యాత్మిక శోభ

తరంగాలు / తుర్కపల్లి, నవంబర్ 09 : తెలంగాణ రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి స్వగృహంలో ఆదివారం శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. తుర్కపల్లి ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మారుమోగి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. బ్రహ్మశ్రీ డాక్టర్ పి ఎం మనోజ్ తాంత్రిక ఆధ్వర్యంలో పెండెం శ్రీనివాస్ గురు స్వామి, రామారావు గురుస్వాముల పర్యవేక్షణలో ఈ మహా పడిపూజను నిర్వహించారు. ఉదయం వేళలో గణపతి హెూమం, సమస్త దేవతా ప్రార్ధనతో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. అనంతరం గణపతి పూజ, అష్టోత్తర శతనామావళి, సుబ్రహ్మణ్యస్వామి పూజ నిర్వహించారు. ముఖ్యంగా, శ్రీ అయ్యప్ప స్వామికి 18 రకాల కలశాలతో అభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి సహా 18 రకాల ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు జరిపి అనంతరం పుష్పాభిషేకం నిర్వహించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి శాస్త్రోక్తంగా పడి పూజ నిర్వహించి పడిని వెలిగించారు. ఈ పూజా కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప స్వామి అధాంగ పూజ, శరణు ఘోష భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి.పూజ ముగింపులో మంత్రపుష్పం, ఆత్మ ప్రదక్షిణ, భూతనాధ స్తోత్ర రత్నావళి, మంగళ హారతి, క్షమాపణ మంత్రంతో కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా బోరెడ్డి అయోధ్య రెడ్డి మాట్లాడుతూ అత్యంత భక్తి శ్రద్ధలతో కఠినమైన నియమనిబంధనలు పాటించే అయ్యప్ప మలాదారులకు స్వామి వారి కరుణాకటాక్షాలు కలగాలని కోరారు.





### అధిక సంఖ్యలో భక్తుల హాజరు

ఈ మహా పడిపూజకు వివిధ మండలాల, గ్రామాల నుంచి వచ్చిన అయ్యప్ప స్వాములతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ తో పాటు గురుస్వాములు పత్తిపాటి హనుమంతరావు, పత్తిపాటి ఆనంద్, రాయగిరి శ్రీనివాస్, రాచర్ల నాగరాజు, చాద కరుణాకర్ రెడ్డి, దొమ్మాట భాస్కర్, పూదూరు శేఖర్, గురునాథ్, కనకరాజు, బోరెడ్డి లక్ష్మీనరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ వంద పడకల ఆసుపత్రి పనులు వెంటనే పూర్తి చేయాలి

## - డివైఎఫ్ఐ




తరంగాలు / చౌటుప్పల్, నవంబర్ 09 : చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో రూ. 38 కోట్ల వ్యయంతో ప్రారంభించిన వంద పడకల ఆసుపత్రి పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, మున్సిపల్ కార్యదర్శి ఎండి ఖయ్యూం డిమాండ్ చేశారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని ఆదివారం పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ఆసుపత్రి పనులు ప్రారంభించింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ బిల్లులు విడుదల చేయకపోవడంతో పనులు ఆగిపోయాయని, వెంటనే పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. జాతీయ రహదారిపై తరచూ జరిగే ప్రమాదాల సమయంలో స్థానికంగా సరైన వైద్యం లభించక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పనులు పూర్తి చేయాలని లేని పక్షంలో రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నూరి మల్లేష్, యానాల రాజశేఖర్ రెడ్డి, గంట శంకర్, సప్పిడి హరీష్ రెడ్డి, లింగారెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వశక్తితో ఎదగాలి

## పద్మావతి సూపర్ మార్కెట్ ప్రారంభోత్సవం



తరంగాలు / ఇబ్రహీంపట్నం, నవంబర్ 9 : యువత కేవలం ఉద్యోగాల వేటలో కాకుండా వ్యాపారం, సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ స్వశక్తితో ఎదగాలని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో అనాజ్ పూర్ రోడ్ లో నూతనంగా స్థాపించిన పద్మావతి సూపర్ మార్కెట్ ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సరికొత మార్గాలు అన్వేషిస్తూ మార్గదర్శులుగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్ మండల మాజీ ఎంపీపీ బుర్ర రేఖ మహేందర్ గౌడ్ ,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, పద్మావతి సూపర్ మార్కెట్ యజమాని లింగ స్వామి, వెంకట ప్రసాద్, శ్రీనివాస్ లింగం, అబ్దుల్లాపూర్ మెట్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర లింగం గౌడ్, పంది పెంటయ్య, అల్లి యాదయ్య, పాలడుగు నాగార్జున ,సుర్వి పోచయ్య, నర్సింహ, యాదయ్య, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్ గెలుపుకు కృషి చేయాలి

## - కూన శ్రీశైలం గౌడ్ మంత్రి వివేక్, ఎంపీ వంశీ కృష్ణతో కలిసి ప్రచారం.

తరంగాలు / కుత్బుల్లాపూర్, నవంబర్ 09 : జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ను భారీ మెజారిటీతో గెలిపించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని షేక్ పేట్ డివిజన్, మధురా నగర్లో ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మంత్రి వివేక్, ఎంపీ వంశీ కృష్ణతో కలిసి కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నవీన్ యాదవ్ గెలుపుతోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, డివిజన్ నాయకులు, కాలనీ వాసులు, కార్యకర్తలతో పాటు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గంజాయి మత్తు కాదు, విద్య - ఉపాధే నిజమైన వెలుగు యువత మారితే దేశం మారుతుంది - ఇ. ఎల్. వి భాస్కర్

తరంగాలు / యాదాద్రి భువనగిరి, నవంబర్ 09 : గంజాయి మత్తు కాదు, విద్య, ఉపాధే నిజమైన వెలుగు అని ఇ.ఎల్.వి భాస్కర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో ఆదివారం జైహింద్ ఫంక్షన్ హాల్ లో ఇ.ఎల్.వి (ఇరగదిండ్ల లక్ష్మమ్మ వీరయ్య) భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ ఆధ్వర్యంలో మొదట భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్వామి వివేకానంద, భగత్ సింగ్, భగీరథ మహర్షి, బాపూజీ, బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాలకు పూలమాలలు అర్పించి, శివాలయం వరకు ర్యాలీగా పాదయాత్ర చేశారు. యువత, అభిమానుల హర్షధ్వానాల నడుమ సభా వేదిక చేరుకున్న భాస్కర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ నేటి యువత గంజాయి మత్తుకు బానిసై బంగారం లాంటి భవిష్యత్తు అంధాకారం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి వ్యసనం ఒక్క వ్యక్తి జీవితాన్నే కాదు, కుటుంబాలనే నాశనం చేస్తుంది. ఈ సామాజిక ముప్పును అరికట్టడం ఫౌండేషన్ ప్రధాన కర్తవ్యం అన్నారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తుల సమాచారం అందిస్తే రూ.10 వేల నగదు ప్రోత్సాహకం ఇస్తామని ప్రకటించారు. నిరుపేదలకు విద్య, వైద్యం, ఉపాధి అందించడమే ఇ.ఎల్.వి ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. ఈ సేవలు మునుగోడుకే పరిమితం కావు, ఉమ్మడి నల్లగొండ జిల్లా అంతా సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. విద్యను ఆయుధంగా చేసుకొని యువత సమాజ నిర్మాణంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. గోవులను రక్షించడమే ధ్యేయంగా గట్టుప్పల్‌లోని తన 11 ఎకరాల భూమిలో గో సంరక్షణశాల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గోవులను అక్రమంగా తరలించే వారిపై చర్యలు తప్పవని, గోమాత రక్షణ అంటే మన సంస్కృతి రక్షణ అని అన్నారు. యువతకు వృత్తి నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు వెల్లడించారు. తమకు నచ్చిన రంగంలో వ్యాపారం చేయాలనుకునే యువతకు బ్యాంకు రుణాలు అందించేందుకు సహకరిస్తానని, ఎవరి కలలు కూడా ఆర్థిక ఇబ్బందులతో ఆగిపోకూడద అని హామీ ఇచ్చారు. రైతుల సమస్యలను ప్రస్తావించిన భాస్కర్ ఐకెపి సెంటర్లలో ధాన్యం నిల్వ చేసుకునేందుకు షెడ్లు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. వర్షాలతో రైతుల ధాన్యం నాశనం కావడం బాధాకరం, వారి కన్నీళ్లు తుడవడం కూడా మన బాధ్యతే అన్నారు. కండరాల క్షీణత బాధితులకు అండగా ఉంటానని భాస్కర్ హామీ ఇచ్చారు. వాళ్ల ఆరోగ్య సంరక్షణ పూర్తిగా మా బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇ.ఎల్.వి ఫౌండేషన్ డైరెక్టర్ ఇరగదిండ్ల అశోక్, సభ్యులు, యువత, అభిమానులు భారీగా పాల్గొని సభను విజయవంతం చేశారు.



# త్రిబుల్ ఆర్ భూనిర్వాసితులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి



తరంగాలు / యాదాద్రి భువనగిరి, నవంబర్ 9 : సంస్థాన్ నారాయణపురం మండలానికి చెందిన వివిధ గ్రామాల త్రిబుల్ ఆర్ బాధిత రైతులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డిని కలిసి దక్షిణ భాగం అలైన్మెంట్ మార్పును రద్దుచేసి రీసర్వే చేయాలని కోరారు. అలాగే నారాయణపురం మండలం సాగుభూముల రక్షణ కొరకు కృషి చేసి బాధిత రైతులకు న్యాయం జరిగే విధంగా చేయాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల త్రిబుల్ ఆర్ భూనిర్వాసితులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి : బీసీ జేఏసీ





నల్గొండ ఆర్సి, నవంబర్ 9, తరంగాలు : బీసీలకు విద్య ఉద్యోగ స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్న కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలోని టీఎన్జీవో భవన్లో నిర్వహించిన కుల సంఘాల సమావేశంలో 40 కుల సంఘాలకు సంబంధించిన నాయకులు పాల్గొనడం జరిగింది. అన్ని కుల సంఘాల నాయకులు బీసీ జేఏసీ చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ జిల్లా జేఏసీ చైర్మన్ గా ఆమోదం తెలిపి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయాలని కుల సంఘాల నాయకులందరూ తీర్మానించడం జరిగింది. రేపటి నుండి బీసీ రిజర్వేషన్ల కోసం జిల్లా వ్యాప్తంగా బీసీ లందరూ ఉద్యమించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మునాస ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. డిసెంబర్ ఫస్ట్ నుంచి నిర్వహించే పార్లమెంటు సమావేశాలలో బీసీ బిల్లు కోసం ప్రతిపక్షాలు మరియు అధికారపక్షం పార్లమెంట్లో చర్చించి బీసీ బిల్లును ఆమోదింపజేయాలని కోరారు. బీసీ బిల్లు పెట్టాల్సినటువంటి ప్రధానమంత్రి మౌనం విడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమ తరహాలో ఈ రాష్ట్రంలో మరో బీసీ ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు జిల్లాలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాల నుండి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏ కార్యక్రమం నిర్వహించిన భారీ ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని మోడీ తో కల్పించాలని కోరారు. ఒకవేళ ప్రధాని అపాయింట్మెంట్ ఇవ్వకపోతే ప్రధాని ఇంటి ముందు సీఎం రేవంత్ రెడ్డి ధర్నా చేయాలని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10 శాతం ఇస్తే మా బీసీలం సపోర్ట్ చేశామని అదేవిధంగా మా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకి 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఈ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు కల్పించేదాకా ఈ రాష్ట్రంలో బీసీ ఉద్యమాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ మన్మయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుంటోజు వెంకటాచారి,రజక సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక రాజు చెన్నయ్య, మున్నూరు కాపు సంఘం వైద్యుల సత్యనారాయణ ,పాల్వాయి రవి, గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల శంకర్ గౌడ్, పద్మశాలి సంఘం కర్నాటి యాదగిరి, యాదవ సంఘం చెన్నూరి భరద్వాజ యాదవ్, మేరు సంఘం నవీన్ కుమార్, ముదిరాజ్ సంఘం దుడ్డు కృష్ణమూర్తి, బెస్త సంఘం అంబటి శివకుమార్, మైనార్టీ నాయకులు ఖదీర్, వివిధ కుల సంఘాల నాయకులు పందుల సైదులు గౌడ్, గండిచెరువు వెంకన్న గౌడ్, అయితగోని జనార్దన్ గౌడ్, పుట్ట వెంకన్న గౌడ్ ,మార్గం సతీష్ కుమార్, ఖమ్మంపాటి శంకర్ దుర్గ, గడగోజు విజయ్ చారి, చెన్నోజు రాజు, మచ్చ గిరి, అనంత నాగరాజ్ గౌడ్, తలారి యాదగిరి, అంజయ్య, సత్యనారాయణ, నరసింహ, జీవన్ బాబు, యోగానంద రావు, వి అంజయ్య, వి వెంకటరమణ ,పి రవి రాజు, ఈ సైదులు, సతీష్ యాదవ్, సందీప్, రాజశేఖర్, ఆంజనేయులు, గడ్డం శంకరయ్య, మేడి కిరణ్, గణేష్ రవికుమార్, మజీద్, ఎస్కే ముస్తఫా, నజీర్, కల్లూరు సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీలు సంఘటితం కావాలి

### అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం







వరంగల్, నవంబర్ 9, తరంగాలు : పద్మశాలీలు తమ హక్కుల సాధాన కోసం సంఘటితం కావాలని అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు.ఆదివారం హాసన్ పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట ప్రాంగణంలో పద్మశాలి కులస్థుల కార్తీక మాస వన భోజన మహోత్సవం వైభవం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షులు మరియు కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ముందుగా మార్కండేయునికి, శివ లింగానికి ఈగ మల్లేశం ప్రత్యేక పూజలు చేసి,జ్యోతి ప్రజ్వలన చేశారు.అనంతరం ఈగ మల్లేశం మాట్లాడుతూ పద్మశాలీలు సంఘటితముగా ఏర్పడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రావలసిన సంక్షేమ నిధులు, రుణమాఫీ మరియు జి.ఎస్.టి,పరపతి సంఘాలలో పేరుకపోయిన బకాయిలు వెంటనే మాఫీ చేయాలని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అదేవిధంగా పలుమార్లు ప్రధాన మంత్రిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా మన భారతదేశంలో టెక్స్టైల్ అండ్ డిజైన్ ఇంజనీరింగ్ కాలేజీ కేవలం ఒకే ఒక్క గుజరాత్ రాష్ట్రంలోనే నెలకొల్పబడినది. మన దక్షిణ భారత దేశంలో ఎక్కడా కూడా ఒక్క టెక్స్టైల్ అండ్ డిజైన్ ఇంజనీరింగ్ కాలేజీ లేనందున, మన తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా లో నెలకొల్పబడిన టెక్స్టైల్ పార్క్ లో కూడా పద్మశాలి చేనేత, జౌళి కార్మికుల పిల్లల చదువులకు ప్రత్యామ్నాయంగా టెక్స్టైల్ మరియు డిజైన్ ఇంజనీరింగ్ కాలేజీ ను నెలకొల్పాలని, యారన్ మరియు ముడి సరుకులు మీద కేంద్ర రాష్ట్రాలూ జి.ఎస్.టి ని పూర్తిగా ఎత్తి వేసి పద్మశాలి కార్మికులకు తోడ్పాటు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన హన్మకొండ జిల్లా అధ్యక్షులు బచ్చు ఆనందం, గడ్డం భాస్కర్, వైద్యం రాజగోపాల్, జిల్లా యూత్ అధ్యక్షులు బత్తుల రమేష్ బాబు తదితర కార్యవర్గ నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో పద్మశాలి కులస్థులకు ఎంతో మనో ధైర్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు ఈగ మల్లేశం



కు శాలువ మరియు మెమెంటో తో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వడ్నాల నరేందర్, కుసుమ సతీష్, గోరంట్ల రాజు, డి. రామ్మూర్తి, బేతి అశోక్, కుసుమ శ్యామ్, చిలగాని మోహన్, దేవులపల్లి సదానందం, గుండు సదానందం, వెంకన్న, రవీందర్ మరియు మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని దిగ్విజ-యం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ కే ప్రజల మద్దతు

- బీజేపీని గెలిపించేందుకు తహతహలాడుతున్న బీఆర్ఎస్
- గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ
- ఓటమి తప్పదని తెలిసే.. కాంగ్రెస్ పార్టీ పై ఇరు పార్టీల తప్పుడు ప్రచారం
- ఈ రెండు పార్టీల పట్ల జూబ్లీహిల్స్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జూబ్లీహిల్స్ లో ఇంటింటి ప్రచారం చేపట్టిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



జూబ్లీహిల్స్, నవంబర్ 9, తరంగాలు : జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ కే ప్రజల మద్దతు ఉందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ఆదివారం వెంగళరావు నగర్ 99వ డివిజన్ పరిధిలోని 211, 212, 213, 214, 215, 216 బూతుల పరిధిలో మాజీ గద్వాల జెడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య, కామారెడ్డి మున్సిపల్ ఛైర్పర్సన్ హిందూ ప్రియా లతో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార కార్యక్రమంలో ఇంటింటికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగరాజు ను ప్రజలు సాధారణంగా ఆహ్వానించి శాలువాతో సన్మానించారు. వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రధానంగా కాలనీలో నీటి, విద్యుత్ వైర్ల సమస్యలు ఉన్నాయి అని నా దృష్టికి వచ్చిందని అభ్యర్థి గెలిచిన వెంటనే సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలియజేస్తూ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చేతి గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆత్మవిశ్వాసం కాంగ్రెస్ పక్షాన స్పష్టంగా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు బీఆర్ఎస్ తెర వెనుక పనిచేసింది. ఈ సారి కూడా బీజేపీకి లాభం చేకూర్చేందుకు ఇరు పార్టీలు కలిసి కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రజలు ఈసారి ఆ మాయమాటలకు లోబడరు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ కే ప్రజల మద్దతు బీజేపీని గెలిపించేందుకు తహతహలాడుతున్న బీఆర్ఎస్ గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు పనిచేసిన బీఆర్ఎస్ ఓటమి తప్పదని తెలిసే.. కాంగ్రెస్ పై ఇరు పార్టీల తప్పుడు ప్రచారం. ఈ రెండు పార్టీల పట్ల జూబ్లీహిల్స్ ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నవంబర్ 11వ తేదీన జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలను ఎమ్మెల్యే నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ సెల్ అధ్యక్షులు పిన్నింటి వెంకట్రాం నరసింహారెడ్డి, హనుమకొండ జిల్లా జేబీఎం అధ్యక్షులు జన్నపు రెడ్డి రుక్వేద్ రెడ్డి , స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇన్చార్జులు, కన్వీనర్లు,తదితరులు పాల్గొన్నారు.









# ప్రతిఘటనోద్యమ నిర్మాత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి



నల్గొండ ఆర్సి, నవంబర్ 9, తరంగాలు : భారత విప్లవోద్యమ నిర్మాత, ప్రతిఘటన పోరాట రూపశిల్పి కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి సభను సీపీఐ యం-యల్, న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్ లో బి.వి చారి అధ్యక్షతన నిర్వహించారు. సభకు ముందుగా చంద్ర పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నవంబర్ 1-9 వరకు విప్లవోద్యమంలో పోలీస్ రాజ్యంచే, భూస్వాముల, గుండాలచే హత్య చేయబడిన, అనారోగ్యంతో అమరులైన వీరులను స్మరిస్తూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎం-ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ పాల్గొని మాట్లాడుతూ. భారత విప్లవొద్యమానికి చంద్ర పుల్లారెడ్డి దిశ, దశను నిర్దేశించినాడని అని అన్నారు. ఇంజనీరింగ్ విద్యను మధ్యలోనే వదిలేసి విప్లవొద్యమంలో అసమానతలు లేని సమాజం కోసం నిరంతరం తపించి రివిజనిజానికి, నయా రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడిన విప్లవ సిద్ధాంత కర్త చంద్ర పుల్లారెడ్డి అని అన్నారు. అడివి లో అడుగుబెట్టి గోదావరి ప్రాంతంలో పార్టీని విస్తరింప చేసి ఆదివాసిలకు అండగా నిలిచారని అన్నారు. వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచి పెట్టి, 14 రాష్ట్రాలలో విప్లవోద్యమాన్ని నిర్మించాడని అన్నారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి ఇచ్చిన పిలుపునందుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యానాల మల్లారెడ్డి, విక్రమ్, చంద్రారెడ్డి, జెన్ను, పలస బిక్షం, బూరుగు అంజన్న, గడ్డం అమృత రెడ్డి, పిడమర్తి వెంకన్న, మారోజు వీరన్న, పజ్జూరు కృష్ణారెడ్డి, అలుగుబెల్లి, కాకి లక్ష్మారెడ్డి, యానాల వీరారెడ్డి లతో పాటు ఊరూరా ఎంతోమంది విప్లవ కారులు పిడిత ప్రజల కోసం జీవితాంతం పోరాడి అమరుల య్యారని అన్నారు. వారు దోపిడీ, పీడన, అసమానతలు రద్దు కావాలని కోరుకొని నూతన సమాజం కోసం కలలు కన్నారని అన్నారు. వారి ఆశయ సాధనలో అశేష ప్రజానీకాన్ని పోరాటం వైపు మల్లించాలని అన్నారు.నేడు దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూలం విదానాలను అనుసరిస్తూ ఫాసిస్ట్ పాలనను వేగవంతం చేస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ ను అందలం ఎక్కిస్తుందని అన్నారు. కార్పొరేట్ అభివృద్దె దేశ అభివృద్ధిగా ప్రచారం చేస్తుందని తెలిపారు. దేశ సంపదను అదాని, అంబానీ లకు కట్టబేడుతుందని, అడవి సంపద ను కొల్లగొట్టడానికి ఆఫరేషన్ కాగార్ పేరుతో ఆదివాసులను, మావోయిస్టులను హత్యలు చేస్తుందని అన్నారు. రాష్ట్రములో రేవంత్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కావడం లేదని అన్నారు. రైతు పంటను కొనుగోలు చేయడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహారిస్తోందని అన్నారు. అమ-రవీరుల స్ఫూర్తి తో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాలపై బలమైన విప్లవ పోరాటాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎం-ఎల్ న్యూడెమోక్రసీ నాయకులు బొంగరాల నర్సింహా, రావుల వీరేష్, మాగి క్రాంతీ, లోకేష్, శంకర్, లింగస్వామి, యాదయ్య అయోధ్య, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలి

## - జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ ఆర్సీ, నవంబర్ 9, తరంగాలు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్రంలోని నటరాజ్ టాకీస్ రోడ్డు బొట్టుగూడలో ఏర్పాటుచేసిన నూతన సరోజిని హాస్పటల్ అయిస్, గ్యాస్ట్రో, కేర్ సెంటర్ ను మెడివిజన్ ఐ కేర్ సెంటర్ చైర్మన్ డాక్టర్ రవికుమార్ రెడ్డి, డాక్టర్ రమేష్ ఆర్తో, డాక్టర్ శశాంక్ జనరల్ వైద్యుని పిల్లలతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి సెంటర్ ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రోగులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా నలగొండ పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటులో నూతన హాస్పిటల్ ను ప్రారంభించుకోవడం చాలా అభినందనీయమని అన్నారు. రోగుల ఆర్థిక స్థితులు రోగుల ఆర్థిక స్థితిగతులను చూసి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ పి వి ఎన్ మూర్తి, డాక్టర్ అనురాధ, డాక్టర్ మైత్రి, తదితరులు పాల్గొన్నారు.

# గోవిందు తండా గ్రామ లంబాడీ జేపసీ నూతన కమిటీ ఎన్నిక

## - అధ్యక్షులుగా అజ్మీరా వినోద్ నాయక్






ఖానాపురం నవంబర్ 09 తరంగాలు : ఖానాపురం మండలంలోని నర్సంపేట నియోజకవర్గ లంబాడి జేఏసీ కన్వీనర్ డాక్టర్ జాటోత్ ఉదయ్ సింగ్ నాయక్ ఆదేశానుసారంగా ఖానాపురం మండల లంబాడి జేఏసీ కమిటీ అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్,లంబాడి మండల సలహాదారులు నాయకులు జాటోత్ బాలు నాయక్,బాధవత్ బాలకిషన్,జాటోత్ సదర్ లాల్ నాయక్ ఆధ్వర్యంలో గోవిందు తండా గ్రామంలోని లంబాడి జేఏసీ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షులుగా అజ్మేరా వినోద్ నాయక్,ఉప అధ్యక్షులు సభావాట్ బిక్షపతి నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు అజ్మీర గోవిందు నాయక్,అజ్మీర వెంకన్న నాయక్,జరుపుల సుమన్ నాయక్, భూక్యా కృష్ణ నాయక్, భూక్య వెంకన్న నాయక్,బాధావత్ దేవా నాయక్, ఇస్లావత్ హరి నాయక్,బోడ దేవేందర్ నాయక్,అజ్మీరా లక్ష్మణ్ నాయక్,అజ్మీరా శ్రీరామ్ నాయక్,అజ్మీరా రాజు నాయక్, అజ్మీర శోభన్ నాయక్,జరుపుల శోభన్ నాయక్,బాధవత్ నగేష్ నాయక్,బాధవత్ గణేష్ నాయక్, జరుపుల నవీన్ నాయక్,బాధవత్ సంతోష్ నాయక్,దసరా నాయక్ మోహన్ నాయక్ తండా వాసులు పాల్గొన్నారు.

# కీర్య తండా గ్రామ లంబాడీ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

## - అధ్యక్షులుగా గుగులోతు కిషన్ నాయక్





ఖానాపురం నవంబర్ 09 తరంగాలు ఖానాపురం మండలంలోని నర్సంపేట నియోజకవర్గ లంబాడి జేఏసీ కన్వీనర్ డాక్టర్ జాటోత్ ఉదయ్ సింగ్ నాయక్ ఆదేశానుసారంగా ఖానాపురం మండల లంబాడి జేఏసీ కమిటీ అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్,లంబాడి మండల సలహాదారులు నాయకులు జాటోత్ బాలు నాయక్,బాధవత్ బాలకిషన్,జాటోత్ సదర్ లాల్ నాయక్ ఆధ్వర్యంలో కీర్య తండా గ్రామంలోని లంబాడి జేఏసీ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షులుగా గుగులోతు కిషన్ నాయక్,ఉప అధ్యక్షులు బానోతు రాజు నాయక్, కో కన్వినర్ నునవత్ యాకుబ్ నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహా దారులు బాధవత్ హ్యాట్య నాయక్, బానోతు రమేష్ నాయక్,బానోతు రఘు నాయక్,బోడ హర్ష నాయక్, బోడ సురేష్ నాయక్ బానోతు బాబు నాయక్,నునవత్ కిషన్ నాయక్, బాధవత్ భద్రు నాయక్, అజ్మీరా ఈర్య నాయక్, బాధవత్ రవి నాయక్, బాధవత్ ఆలు నాయక్, బోడ రవి నాయక్, గుగులోతు యాకుబ్ నాయక్, స్వామి నాయక్, భద్రు నాయక్, బాధవత్ భద్ర నాయక్, అజ్మీరా రామ్య నాయక్, రాజు నాయక్ తండా వాసులు పాల్గొన్నారు.

# సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరో ఎంట్రీ



సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి మరో యువ కథానాయకుడు తెలుగు చిత్రసీమకు పరిచయం కాబోతున్నాడు. సూపర్‌స్టార్ మహేశ్ బాబు అన్నయ్య, దివంగత నటుడు రమేశ్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా అరంగేట్రం చేయనున్నాడు. కొంతకాలంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వార్తలకు ఇప్పుడు అధికారిక ముద్ర పడింది. 'ఆర్‌ఎక్స్ 100' చిత్రంతో సంచలనం సృష్టించిన దర్శకుడు అజయ్ భూపతి, జయకృష్ణను హీరోగా పరిచయం చేసే బాధ్యతను తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. తిరుమల కొండల నేపథ్యంలో ఉన్న ఒక ఆసక్తికరమైన పోస్టర్‌ను పంచుకుంటూ ఈ ప్రకటన చేశారు. ఈ సినిమా టైటిల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. దీంతో ఘట్టమనేని అభిమానుల్లో ఆనందం వెల్లువెత్తింది. ఈ చిత్రానికి ప్రముఖ నిర్మాత అశ్వనీదత్ సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. సరిగ్గా ఇదే తరహాలో గతంలో మహేశ్ బాబును 'రాజకుమారుడు' సినిమాతో హీరోగా పరిచయం చేసింది కూడా అశ్వనీదత్ కావడం గమనార్హం. ఇప్పుడు ఆయన మేనల్లుడి తొలి సినిమాకు కూడా అశ్వనీదత్ అండగా నిలవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తాత, బాబాయ్ వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూ వస్తున్న జయకృష్ణ, తన తొలి చిత్రంతో ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటారో చూడాలని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# పెళ్లిపై రష్మిక మందన్న ఆసక్తికర వ్యాఖ్యలు..

సినీ నటి రష్మిక మందన్న తన పెళ్లి, కాబోయే భర్త గురించి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. యంగ్ హీరో విజయ్ దేవరకొండతో నిశ్చితార్థం అయిందని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని కొంతకాలంగా వార్తలు వస్తున్న నేపథ్యంలో.. తనకు కాబోయే వ్యక్తి ఎలా ఉండాలో రష్మిక మనసులోని మాట బయటపెట్టారు. తాజాగా ఓ చిట్‌చాట్‌లో పాల్గొన్న రష్మికకు తన భాగస్వామికి ఉండాల్సిన లక్షణాల గురించి ప్రశ్న ఎదురైంది. దీనికి ఆమె స్పందిస్తూ, "నన్ను పూర్తిగా అర్థం చేసుకునే వ్యక్తిని పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. నా వైపు నుంచి ప్రతీ విషయాన్ని ఆలోచించాలి. నా పనిని గౌరవించాలి. ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొనే వ్యక్తి అయితే బాగుంటుంది" అని తెలిపారు. అంతటితో ఆగకుండా, "మంచి వ్యక్తిత్వంతో పాటు, నా కోసం యుద్ధం చేయగల సత్తా అతనికి ఉండాలి. అలాంటి వ్యక్తి నా జీవితంలోకి వస్తే, అతని కోసం నేను ఎంత దూరమైనా వెళ్తాను. అవసరమైతే యుద్ధంలో తూటాకు కూడా ఎదురెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను" అంటూ తన ప్రేమను, నిబద్ధతను తెలియజేశారు. ఆమె చెప్పిన లక్షణాలన్నీ విజయ్ దేవరకొండకు సరిగ్గా సరిపోతాయని, అతడిని ఉద్దేశించే రష్మిక ఈ వ్యాఖ్యలు చేసిందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



# ఓటీటీలోకి సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా'..




యూత్ ఐకాన్ సిద్దు జొన్నలగడ్డ, రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ డ్రామా 'తెలుసు కదా'. దీపావళి కానుకగా అక్టోబరులో థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ నెల 14వ తేదీ నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమైన సంగతి తెలిసిందే. థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన ప్రేక్షకులు ఓటీటీ విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమా కథ విషయానికొస్తే.. అనాథ అయిన వరుణ్ (సిద్దు జొన్నలగడ్డ) తనకు ఓ మంచి కుటుంబాన్ని ఏర్పరుచుకోవాలని కలలు కంటాడు. ఈ క్రమంలో కాలేజీలో రాగ (శ్రీనిధి శెట్టి)తో ప్రేమలో పడతాడు. కానీ కొన్ని కారణాల వల్ల ఆమె అతనికి దూరమవుతుంది. ఆ తర్వాత అంజలి (రాశీఖన్నా)ను పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాడు. సంతోషంగా సాగిపోతున్న వారి వైవాహిక జీవితంలో ఓ ఊహించని సమస్య ఎదురవు- తుంది. అదే సమయంలో వరుణ్ జీవితంలోకి రాగ తిరిగి ప్రవేశిస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? రాగ అసలు వరుణ్‌ను ఎందుకు వదిలి వెళ్లింది? ఈ ముగ్గురి మధ్య బంధం ఎలాంటి సంఘర్షణకు దారితీసిందనేదే ఈ చిత్ర కథ.

# అనుపమ పరమేశ్వరన్ కు ఆన్ లైన్ వేధింపులు



ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ ఆన్‌లైన్ వేధింపుల కేసు ఊహించని మలుపు తిరిగింది. తనను సోషల్ మీడియాలో అసభ్యకరంగా చిత్రీకరిస్తూ, మానసికంగా వేధిస్తున్నారంటూ అనుపమ ఇటీవల కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు పూర్తి చేశారు. అయితే, ఈ వేధింపుల వెనుక ఉన్నది ఓ అబ్బాయి కాదని, తమిళనాడుకు చెందిన 20 ఏళ్ల యువతి అని తేలడంతో అనుపమతో పాటు అందరూ ఆశ్చర్యపోయారు.

**అసలేం జరిగిందంటే...!**

కొంతకాలంగా ఓ ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ నుంచి తనపై దుష్ప్రచారం జరుగుతున్నట్లు అనుపమ పరమేశ్వరన్ గుర్తించారు. కేవలం తననే కాకుండా తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహనటులను కూడా లక్ష్యంగా చేసుకుని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆమె తెలిపారు. తన ఫొటోలను మార్ఫింగ్ చేసి పోస్ట్ చేయడంతో తీవ్రంగా మనస్తాపానికి గురయ్యానని ఇన్‌స్టాగ్రామ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే వ్యక్తి పలు ఫేక్ అకౌంట్లు సృష్టించి ఈ వేధింపులకు పాల్పడుతున్నట్టు గుర్తించి, కేరళ సైబర్ పోలీసులను ఆశ్రయించారు.

ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సాంకేతిక ఆధారాలతో కొద్ది రోజుల్లోనే నిందితురాలిని పట్టుకున్నారు. విచారణలో ఆమె తమిళనాడుకు చెందిన 20 ఏళ్ల యువతి అని నిర్ధారించారు. ఈ విషయం తెలిసి తాను షాక్‌కు గురైనట్లు అనుపమ తెలిపారు.

ఈ పరిణామంపై స్పందిస్తూ, "ఆమె వయసు చాలా చిన్నది. తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పూర్తి వివరాలు పంచుకోవాలనుకోవడం లేదు. కానీ, ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయను. న్యాయపరంగానే ముందుకెళతాను" అని అనుపమ పరమేశ్వరన్ స్పష్టం చేశారు.

# బిగ్ బాస్ హౌస్‌లో ఊహించని ట్విస్ట్.. స్వయంగా వైదొలిగిన రాము

ప్రముఖ రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగు సీజన్ 9లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. 9వ వారం ఎలిమినేషన్ ప్రక్రియ ఉత్కంఠగా సాగుతున్న తరుణంలో, కంటెస్టెంట్ రాము రాథోడ్ స్వచ్ఛందంగా షో నుంచి వైదొలిగారు. ఈ వారం అత్యల్ప ఓట్లు పోలైన సాయి శ్రీనివాస్ ఎలిమినేట్ అవుతాడని అందరూ భావిస్తున్న సమయంలో రాము నిష్క్రమణ పెద్ద ట్విస్ట్‌గా మారింది. గత కొన్ని వారాలుగా రాము ఆటలో చురుకుగా పాల్గొనడం లేదు. నామినేషన్లలో వాదనలకు దిగకుండా, తానే వెళ్ళిపోతానంటూ డల్‌గా ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఎపిసోడ్‌లో హోస్ట్ నాగార్జున ఇదే విషయాన్ని ప్రస్తావించారు. కుటుంబ సభ్యులు గుర్తొస్తున్నారా అని అడగ్గా, రాము తనదైన శైలిలో పాట రూపంలో సమాధానమిచ్చాడు. 'బాధయితోందే యాదిలో మనసంతా.. మస్తు బరువైతోందే అమ్మ యాదిలో మనసంతా' అంటూ భావోద్వేగానికి లోనయ్యాడు. "చిన్నప్పుడు మా అమ్మానాన్న పని కోసం వేరే ఊరికి వెళ్లారు. దాదాపు 5-6 ఏళ్లు వారికి దూరంగా ఉన్నాను. ఇప్పుడు జీవితంలో అంతా కుదురుకుంది. వారిని చూసుకుందామనుకునే సమయంలో మళ్లీ ఇన్ని రోజులు దూరంగా ఉన్నాను" అని రాము తన ఆవేదనను వ్యక్తం చేశాడు. అతని మానసిక పరిస్థితిని అర్థం చేసుకున్న నాగార్జున, బిగ్ బాస్




గేట్లు తెరవాలని ఆదేశించారు. బయటకు వెళ్లే అవకాశం ఇవ్వగా, "వెళ్తాను సర్" అని రాము చెప్పడంతో అతని ప్రయాణం ముగిసింది. ప్రస్తుతం 9వ వారం నామినేషన్స్‌లో సంజన, సుమన్ శెట్టి, భరణి, కల్యాణ్, రాము, సాయి శ్రీనివాస్, తనూజ ఉన్నారు. శుక్రవారం రాత్రితో ముగిసిన ఓటింగ్ ప్రకారం సాయి శ్రీనివాస్ చివరి స్థానంలో నిలిచాడు. అయితే, రాము సెల్ఫ్ ఎలిమినేట్ కావడంతో ఈ వారం మరొక ఎలిమినేషన్ ఉంటుందా లేదా అనే దానిపై సందిగ్ధత నెలకొంది. చాలావరకు రాము నిష్క్రమణతో ఈ వారం ఎలిమినేషన్ ప్రక్రియ ముగిసే అవకాశం ఉందని, దీంతో సాయి శ్రీనివాస్ సేఫ్ అయినట్లేనని తెలుస్తోంది.

Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com